సాక్షి
విశాఖపట్నం

ఆదివారం । 2 । జూలై । 2023

- నేడే సింహగిరి ప్రదక్షిణ
- ఏర్పాట్లు పూర్తి
- నేటి రాత్రి 9 గంటల వరకే స్వామి దర్శనాలు


హరి సంకీర్తన.. గిరి ప్రదక్షిణ

సింహాద్రి అప్పన్నా.. అని ఆర్తితో పిలిస్తే అభయహస్తం అందించే స్వామి.. శ్రీ వరాహ లక్ష్మీ నృసింహుడు. కృతయుగంలో వరాహ, నారసింహ రూపాలను ఒక్కటిగా చేసుకుని శ్రీ మహావిష్ణువు శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామిగా వెలసిన ఆధ్యాత్మిక క్షేత్రం ఇది. చందన పరిమళాలు, సంపెంగ సౌరభాలతో శోభిల్లుతున్న సింహాచల క్షేత్రంలోని ప్రధాన ఉత్సవాల్లో ఒకటి గిరి ప్రదక్షిణ. సింహగిరి చుట్టూ 32 కిలోమీటర్ల మేర కాలినడకన ఒక్కసారి ప్రదక్షిణ చేస్తే భూ ప్రదక్షిణతో సమానమని భక్తులు భావిస్తారు. ఆషాఢ చతుర్దశిని పురస్కరించుకుని ఆదివారం జరిగే గిరి ప్రదక్షిణకు కలెక్టర్ మల్లికార్జున ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. – సింహాచలం


తొలి పావంచా వద్ద కొలువుదీరిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి


రెండో ఘాట్ రోడ్డు వద్ద నమూనా ఆలయం





ఏర్పాట్లు ఇలా..

- భక్తులు గిరి ప్రదక్షిణ చేసే 32 కిలోమీటర్ల మార్గంలో 29 ప్రదేశాల్లో దేవస్థానం స్టాళ్లు ఏర్పాటు చేసింది. ఆ స్టాళ్లలో భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు కుర్చీలు ఉంటాయి. ఇక్కడ జీవీఎంసీ మంచి నీటి సదుపాయం కల్పిస్తుంది.
- ప్రదక్షిణ మార్గంలో, సింహగిరిపై పురుషులు, మహిళలకు వేర్వేరుగా 18 ప్రదేశాల్లో 270 మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.
- మొత్తం 11 ప్రాంతాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ప్రైవేట్ ఆస్పత్రులు కూడా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాయి.
- 108 అంబులెన్స్‌ల తో పాటు పలు ప్రైవేట్ ఆస్పత్రుల అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచారు.
- గిరి ప్రదక్షిణను ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు దేవస్థానం అధికారికంగా ప్రారంభిస్తుంది. తొలి పావంచా నుంచి దేవస్థానం ప్రచార రథం బయలుదేరుతుంది.
- ఉదయం నుంచి పలువురు భక్తులు గిరి ప్రదక్షిణ ప్రారంభించడం పరిపాటి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఉదయం నుంచే తొలి పావంచా వద్ద భక్తులకు సేవలందించేందుకు ఏర్పాట్లు చేశారు.
- ఈ సారి హనుమంతవాక నుంచి పాత అడవివరం జంక్షన్‌కి వెళ్లే బీఆర్‌టీఎస్ రోడ్డులో రెండవ ఘాట్ రోడ్డు వద్ద కూడా భక్తులు కొబ్బరికాయలు కొట్టే ఏర్పాటు చేశారు. అక్కడ స్వామి నమూనా ఆలయం ఏర్పాటు చేశారు.

తాత్కాలిక మరుగుదొడ్లు

తొలి పావంచా, అడవివరం గ్రౌండ్, పైనాపిల్ కాలనీ, సెంట్రల్ జైలు, ముడసర్లోవ, చినగదిలి, పెదగదిలి, ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రి, అప్పుఘర్, వెంకోజీపాలెం, డాక్‌యార్డ్ క్వార్టర్స్, పోర్టు డీఎల్‌బి క్వార్టర్స్, సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్, మాధవధార, కుమారి కల్యాణ మండపం, శ్రీనివాసనగర్, పాతగోశాల జంక్షన్, శ్రీదేవి కాంప్లెక్స్


సింహగిరిపై ఏర్పాటు చేసిన దర్శన క్యూలు

- అడవివరంలోని తొలి పావంచా వద్ద, రెండవ ఘాట్‌రోడ్డు వద్ద కలిపి మొత్తం 100 కొబ్బరికాయల బ్రేకింగ్ స్టాండ్‌లు ఏర్పాటు చేశారు. సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా గ్యాలరీలను ఏర్పాటు చేశారు. భక్తులను ఆ గ్యాలరీల్లో ఉంచి విడతల వారీగా కొబ్బరికాయలు కొట్టేందుకు అనుమతిస్తారు.
- దారిపొడవునా భక్తులకు ఆహార పదార్థాలు, పానీయాలు అందించేందుకు 50 వరకు స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చాయి.
- గిరి ప్రదక్షిణను పూర్తి చేసుకుని ఆదివారం రాత్రికే చేరుకునే భక్తులు ఎవరైనా ఉంటే.. వారి సౌకర్యార్థం రాత్రి 9 గంటల వరకు దర్శనాలు కల్పిస్తారు.
- ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని సింహగిరిపై సోమవారం తెల్లవారుజామున మూడు గంటల నుంచి ఆలయ ప్రదక్షిణలకు అనుమతిస్తారు.
- గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకున్న భక్తులందరికీ సోమవారం ఉదయం 5 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిరంతరాయంగా దర్శనాలు అందజేస్తారు. అనంతరం ఢిల్లీ ఉత్సవం నిర్వహించారు. తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి దర్శనాలు ప్రారంభమవుతాయి.
- గిరి, ఆలయ ప్రదక్షిణ భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా దేవస్థానం ఏర్పాట్లు చేసింది. ఆలయ ఉత్తర రాజగోపురం వద్ద, దక్షిణ గోపురం వద్ద బ్రిడ్జిలను ఏర్పాటు చేసింది. కింద నుంచి స్వామి దర్శనానికి, వంతెనపై నుంచి ఆలయ ప్రదక్షిణ చేసేలా ఏర్పాట్లు చేశారు. ఆలయ బాహ్య ప్రాకారం చుట్టూ దాదాపు 400 మీటర్ల మేర భక్తులు ప్రదక్షిణ చేయాల్సి ఉంటుంది.
- భక్తులందరికీ అన్నదాన భవనంలో కదంబం, దద్ధ్యోజనంను అన్న ప్రసాదంగా అందిస్తారు.
- సింహగిరిపై లక్ష లడ్డూలను విక్రయించేందుకు సిద్ధం చేశారు.
- భక్తుల రద్దీ కారణంగా సోమవారం ఆలయ నీలాద్రిగుమ్మం వద్ద నుంచే లఘు దర్శనం ఏర్పాటు చేశారు. ఎవరికీ అంతరాలయ ప్రవేశం లేదు.
- 2,100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, క్రైం తదితర విభాగాల పోలీసులు శనివారం సాయంత్రానికే సింహాచలం చేరుకున్నారు. ఉన్నతాధికారులు వారికి పలు సూచనలు చేశారు. ఏయే ప్రాంతాల్లో విధులు నిర్వర్తించాలో డ్యూటీలు వేశారు.
- మెట్ల మార్గంలో కేవలం సింహగిరికి వెళ్లే భక్తులను మాత్రమే సోమవారం అనుమతిస్తారు. సింహగిరిపై నుంచి కొండ దిగువకి దేవస్థానం ఏర్పాటు చేసిన ఉచిత బస్సుల్లో చేరుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు దేవస్థానం నాలుగు బస్సులు, 35 ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయి. దేవస్థానం సంబంధిత నగదును ఆర్టీసీకి చెల్లించింది.
- భక్తుల రద్దీకి అనుగుణంగా అటు పాత గోశాల వద్ద, ఇటు పాత అడవివరం వద్దనే ఆర్టీసీ బస్సులను నిలుపు చేస్తారు. మరే ఇతర వాహనాలను ఆ మార్గంలో అనుమతించరు.

మెడికల్ క్యాంపులు

వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సింహాచలంలోని తొలిపావంచా, ముడసర్లోవ పార్కు, జోడుగుళ్లపాలెం, అప్పుఘర్, వెంకోజీపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయం, పోర్టు డీఎల్‌బీ క్వార్టర్స్, మాధవధార, ఎన్ఏడీ జంక్షన్, కుమారి కల్యాణ మండపం, పాతగోశాల జంక్షన్, సింహగిరి మెట్ల మార్గం. దారిపొడవునా పలు ప్రైవేట్ ఆస్పత్రులు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాయి.

నేడు, రేపు సింహగిరిపై ఆర్జిత సేవల రద్దు

గిరి ప్రదక్షిణను పురస్కరించుకుని ఈనెల 2, 3 తేదీల్లో సింహగిరిపై ఆర్జిత సేవలు రద్దు చేసినట్టు ఈవో వి.త్రినాథరావు తెలిపారు. స్వామికి సుప్రభాతసేవ, ఆరాధన, నిత్యకల్యాణం, అష్టోత్తరం, సహస్రనామార్చన తదితర ఆర్జిత సేవల టికెట్లన్నీ రద్దు చేసినట్టు పేర్కొన్నారు.

2,100 మంది పోలీసులతో బందోబస్తు 8లో

స్టాళ్లు ఇక్కడే..

సింహచలంలోని తొలి పావంచా, అడవివరం మైదానం, పైనాపిల్ కాలనీ, సెంట్రల్ జైల్, ముడసర్లోవ పార్కు, చినగదిలి రోడ్డు, పెదగదిలి, ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రి, హనుమంతవాక జంక్షన్, జోడుగుళ్లపాలెం, తెన్నేటి పార్కు, అప్పుఘర్, వెంకోజీపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయం, సీతమ్మధారలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం, నరసింహనగర్, సింగాలమ్మ ఆలయం డాక్ యార్డు క్వార్టర్స్, పోర్టు డీఎల్‌బీ క్వార్టర్స్, సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్, మురళీనగర్, మాధవధార, ఆర్అండ్‌బీ, ఎన్ఏడీ జంక్షన్, లక్ష్మీనగర్, కుమారి కల్యాణ మండపం, శ్రీనివాసనగర్, పాత గోశాల జంక్షన్, శ్రీదేవి కాంప్లెక్స్, సింహగిరి మెట్ల మార్గం, కొండపైన బస్టాండ్ ఏరియా...

గిరి ప్రదక్షిణ మార్గం	32 కిలోమీటర్లు
పుష్పరథం ప్రారంభం	నేటి మధ్యాహ్నం 2 గంటలకు
ఆలయ ప్రదక్షిణ ప్రారంభం	రేపు తెల్లవారుజాము 3 గంటల నుంచి..
స్వామి దర్శనం ప్రారంభం	రేపు ఉదయం 5 గంటల నుంచి..
దేవస్థానం ఏర్పాటు చేసిన స్టాళ్లు	29
తాత్కాలిక మరుగుదొడ్లు	270
వైద్య శిబిరాలు	11
సేవలందించే స్వచ్ఛంద సంస్థలు	50 (సుమారు)
బందోబస్తుకు వచ్చిన పోలీసులు	2,100
భక్తులకు సిద్ధం చేసిన లడ్డూలు	లక్ష
ఉచిత ఆర్టీసీ బస్సులు	35

31 వైద్య బృందాలు.. 16 అంబులెన్స్‌లు

మహారాణిపేట: గిరి ప్రదక్షిణ నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మొత్తం 31 వైద్య బృందాలు, 16 అంబులెన్సులను సిద్ధం చేసినట్టు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సోమవారం సాయంత్రం ఆరు గంటల వరకు ఈ వైద్య బృందాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని వివరించారు. 15 వైద్య బృందాల్లో వైద్యులు, నర్సు, ఇతర పారా మెడికల్ సిబ్బంది, 16 వైద్య బృందాల్లో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంబులెన్సులు సిద్ధం చేసినట్లు చెప్పారు. షిఫ్ట్ పద్ధతుల్లో వీరంతా విధులు నిర్వర్తిస్తారు. ప్రోగ్రామ్ అధికారులు వీరిని పర్యవేక్షిస్తారు.


ఆలయ ప్రదక్షిణ భక్తులకు ఏర్పాట్లు

పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం

తొలి పావంచా, హనుమంతవాక జంక్షన్, అప్పుఘర్, మాధవదార, పాత గోశాల జంక్షన్

విధుల్లో 60 మంది దేవదాయ సిబ్బంది

మహారాణిపేట: గిరి ప్రదక్షిణ కోసం మొత్తం 60 మంది దేవదాయ శాఖ సిబ్బంది, అధికారులను నియమిస్తూ ఉప కమిషనర్ ఎస్.సుజాత ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల పాటు ఐదు షిఫ్టుల పద్ధతిలో సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు. భక్తులకు మంచినీటి సరఫరా, ఇతర సదుపాయాలు కల్పిస్తారు. ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తారు.

'జగనన్న సురక్ష'తో వేగవంతమైన సేవలు

- కలెక్టర్ మల్లికార్జున
- తొలి రోజు 638 మందికి ధ్రువీకరణ పత్రాల అందజేత

మద్దిలపాలెం: ప్రజల ఇంటి వద్దకే శీఘ్రగతిన సేవలందించాలనే సదుద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. 'జగనన్నకు చెబుదాం'లో ధ్రువీకరణపత్రాల కోసం అధిక అర్జీలు వచ్చాయని గుర్తించిన ప్రభుత్వం.. వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ప్రారంభించిందని చెప్పారు. జగనన్న సురక్ష తొలి రోజు కార్యక్రమాన్ని జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురంకాలనీలో శనివారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 607 సచివాలయాల్లో 25 బృందాలతో 168 సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 30వ తేదీ వరకు శిబిరాలు కొనసాగుతాయని తెలిపారు. తొలిరోజు 638 మంది అర్జీదారులకు ధ్రువీకరణపత్రాలు అందజేసినట్లు వెల్లడించారు. సచివాలయ సిబ్బంది వారం రోజులుగా ఇంటింటికీ వెళ్లి దరఖాస్తులు స్వీకరించారని చెప్పారు. కుల, ఆదాయ, రేషన్ కార్డు, ఆధార్‌లో మార్పుల కోసం అధిక అర్జీలు వచ్చాయన్నారు. సురక్ష శిబిరాల్లో 11 రకాల సేవలను ఎలాంటి చార్జీలు లేకుండా అందిస్తామని చెప్పారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా 1902 కు ఫోన్ చేసి ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని సూచించారు. వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజల చెంతకు ప్రభుత్వ సేవలను తీసుకొచ్చారన్నారు. ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్, కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్, జీవీఎంసీ జోన్ 3 జోనల్ కమిషనర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. జీవీఎంసీ 41వ వార్డు జోన్-5 కార్యాలయం ఆవరణలో 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రారంభించారు. వార్డు నుంచి సుమారు 400 మంది వివిధ రకాల సేవల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ తెలిపారు.


మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

22న ప్రత్యేక లోక్ అదాలత్

విశాఖ లీగల్: మోటారు ప్రమాదాలు, భూసేకరణకు సంబంధించిన కేసులు తక్షణ పరిష్కారం కోసం ఈనెల 22న ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ పేర్కొన్నారు. శనివారం రెవెన్యూ, పోలీస్, బీమా కంపెనీలు, మెడికల్, రోడ్డు రవాణా శాఖల అధికారులతో మోటార్ యాక్సిడెంట్-భూసేకరణ కేసులకు ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహణ కోసం జిల్లా కోర్టు సముదాయంలోని న్యాయ సేవాసదన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 22న జిల్లాలోని అన్ని జిల్లా కోర్టులు, సివిల్ జడ్జి కోర్టుల్లో నిర్వహించనున్న ప్రత్యేక లోక్ అదాలత్‌లో మోటార్ ప్రమాదాల కేసులు, భూసేకరణకు సంబంధించిన కేసులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కేసులకు అవసరమైన, న్యాయపరమైన సలహాలు ఏమైనా అవసరమైతే జిల్లా న్యాయసేవాధికార సంస్థ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, అనకాపల్లి డీఆర్వో పి.వెంకటరమణ, ఇన్‌చార్జి డీటీసీ వి.జయప్రకాష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేడ్కర్, అల్లూరి జిల్లా ఏఎస్పీ బిఎస్ఎన్ రావు, స్టాండింగ్ కమిటీ కౌన్సిల్ మెంబర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ

ఫుడ్‌సైన్స్, టెక్నాలజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న బీఎస్సీ, ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్, టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకులు డి.ఎ.నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ విద్యార్హత కలిగిన వారు నేరుగా పెదవాల్తేరులోని ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కోర్సు ఫీజుగా రూ.65,000 చెల్లించాన్నారు. మొదటి సంవత్సరం పూర్తిచేస్తే సర్టిఫికెట్, రెండు సంవత్సరాలు పూర్తి చేస్తే డిప్లమో, మూడు సంవత్సరాలు పూర్తిచేస్తే బ్యాచిలర్ డిగ్రీ, నాలుగు సంవత్సరాలు పూర్తిచేస్తే హానర్స్ డిగ్రీ, ఐదు సంవత్సరాలు పూర్తి చేస్తే మాస్టర్స్ డిగ్రీ అందిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు www.audoa.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

తొలిరోజు 88.56 శాతం పింఛన్ల పంపిణీ



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సూరిబాబుకు పింఛను అందజేస్తున్న వలంటీర్ రవి

మహారాణిపేట : వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ శనివారం రాత్రి 9 గంటల సమయానికి జిల్లాలో 88.56 శాతం పూర్తయింది. జిల్లాలో 1,58,301 లక్షల మందికి వివిధ రకాల సామాజిక భద్రత పింఛన్లు ఉన్నాయి. వీరి కోసం ప్రభుత్వం రూ.44 కోట్ల 50 లక్షలు కేటాయించింది. రాత్రి వరకు 1.48 లక్షల మందికి (88.56 శాతం) వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేశారు. ఈనెల 5వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శోభారాణి తెలిపారు.

‘గిరి’ భక్తులకు ఏర్పాట్లు పూర్తి

అల్లిపురం: గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మతో కలసి శనివారం లుంబినీ పార్కు, వెంకోజీపాలెం, మాధవధార, మురళీనగర్, ఎన్ఎస్టీఎల్ రోడ్, పాత గోశాల, సింహాచలం, అడవివరం, పెదగదిలి, హనుమంతువాక, విశాలాక్షినగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీరు, వైద్య శిబిరాలు, తాత్కాలిక మరుగుదొడ్లు, డస్ట్‌బిన్లు, దారి పొడవునా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గిరి ప్రదక్షిణ మార్గంలో రోడ్ల మరమ్మతులు పూర్తి చేసినట్లు చెప్పారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆకులు, పేపర్ ప్లేట్లలో మాత్రమే భక్తులకు ప్రసాదాలు అందజేయాలన్నారు. అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజినీర్ రవి కృష్ణంరాజు, పట్టణ ప్రణాళికాధికారి సునీత, డీడీహెచ్ దామోదరరావు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్ పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

తెలుగుతల్లి ఫ్లై ఓవర్‌పై ప్రమాదం

అల్లిపురం: తెలుగు తల్లి ఫ్లైఓవర్‌పై శనివారం రాత్రి ప్రమాదం చోటుచేసుకుంది. కారు రెండు ద్విచక్రవాహనాలను ఢీకొనగా.. బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి ఫ్లైఓవర్ పై నుంచి కింద పడిపోయినట్లు తెలిసింది. ఇతనితో పాటు మరో ఇద్దరికి కూడా తీవ్ర గాయాలైనట్లు సమాచారం. గాయపడిన వారి వివరాలు తెలియాల్సి ఉంది. సంఘటన స్థలానికి చేరుకున్న టూ టౌన్ సీఐ బి.తిరుమలరావు క్షతగాత్రులను హాస్పటల్‌కు తరలించారు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

సింహాచలం బస్‌పాస్ కౌంటర్ నేడు పనిచేయదు

అల్లిపురం: సింహాచలం గిరి ప్రదక్షిణ సందర్భంగా సింహాచలం బస్‌పాస్ కౌంటర్ ఆదివారం పని చేయదని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎ.అప్పలరాజు ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి యథావిధిగా బస్‌పాస్ కౌంటర్లు పనిచేస్తాయని చెప్పారు. బస్‌పాస్ వినియోగదారులు, విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

పూర్తికాని పోస్టుమార్టం

మహారాణిపేట: అచ్యుతాపురం సాహితీ ఫార్మా పరిశ్రమలో మరణించిన వారికి ఇంకా పోస్టుమార్టం పూర్తి కాలేదు. ఈ పరిశ్రమలోని అగ్ని ప్రమాదంలో కార్మికులు పైలా సత్తిబాబు, ఉప్పాడ తిరుపతి మృతి చెందిన సంగతి విదితమే. పోలీసుల నుంచి పంచనామా నివేదిక రాకపోవడంలో పోస్టుమార్టం నిర్వహించలేదని వైద్యులు శనివారం తెలిపారు. తీవ్రంగా గాయపడ్డ కార్మికులు బియ్యు రామేశ్వర్, సాగిరెడ్డి రాజబాబు, సమంగి అప్పారావులను ఇండస్ ఆస్పత్రికి తరలించినట్లు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. కేజీహెచ్ సీఎస్ఆర్ బ్లాక్‌లో నూకనాయుడు చికిత్స పొందుతున్నట్లు వివరించారు.

2,100 మంది పోలీసులతో బందోబస్తు

దొండపర్తి: గిరి ప్రదక్షిణకు 2,100 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గిరి ప్రదక్షిణ చేసే ప్రాంతాల్లోనే కాకుండా బీచ్, సింహాచలం కొండపైన నిరంతరాయంగా విధులు నిర్వర్తించేలా సిబ్బందిని రెండు షిఫ్టులుగా విభజించారు. వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పార్కింగ్‌ల కోసం ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేశారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖలు సమన్వయంగా విధులు నిర్వర్తించాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. భక్తులకు పలు సూచనలు చేశారు.

- పాత గోశాల జంక్షన్ నుంచి అడవివరం జంక్షన్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఎటువంటి చిల్లర దుకాణాలు, స్టాళ్లకు అనుమతి లేదు.
- భక్తులు తొలి పావంచా వద్ద కొబ్బరికాయలు కొట్టేందుకు.. ముందుగా హోల్డింగ్ కంపార్ట్‌మెంట్‌లోని క్యూల ద్వారా రావాల్సి ఉంటుంది.
- తొలి పావంచా నుంచి అడవివరం వైపునకు మాత్రమే భక్తులను అనుమతిస్తారు. గాంధీనగర్ జంక్షన్ నుంచి తొలిపావంచా వైపు అనుమతించరు.
- కొబ్బరికాయలు కొట్టిన తర్వాత భక్తులు రథం ఉన్న సమయంలో కుమ్మరి దిబ్బవైపు వెళ్లాలి. రథం జంక్షన్‌లో లేని సమయంలో తొలిపావంచా నుంచి మెయిన్ రోడ్ వైపు వెళ్లే అవకాశం ఉంటుంది.
- తాటిచెట్లపాలెం నుంచి ఎన్ఏడీ కొత్త రోడ్డు మధ్యలో భక్తుల సహాయం కోసం పోలీస్ బూకోల్స్, ట్రాకోల్స్, రక్షక్ మొబైల్స్ అందుబాటులో ఉంటాయి.
- ప్రదక్షిణ చేసే మార్గంలో ప్రతి 2 కిలో మీటర్లకు ఒక పోలీస్ మొబైల్ ఉంటుంది. అవసరమైన సందర్భాల్లో వాటి సహాయం పొందవచ్చు.
- వెంకన్నపాలెం జంక్షన్/మారిటల్ హోటల్ జంక్షన్ నుంచి వంటిల్లు వరకు వచ్చిన భక్తులు ఎన్ఏడీ జంక్షన్‌కు వెళ్లకుండా లక్ష్మీనగర్ వైపు వెళ్లాలి.
- సింహాచలం కొండపైకి ఎటువంటి వాహనాలకు పాస్‌లు జారీ చేయలేదు. కొండపైకి ఎటువంటి ప్రైవేట్ వాహనాలకు అనుమతి లేదు. సింహగిరి పైకి దేవస్థానం ఏర్పాటు చేసిన బస్సుల్లోనే వెళ్లాలి.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

- ఆదివారం సాయంత్రం నుంచి మద్దిలపాలెం హనుమంతవాక వైపు వెళ్లే కార్లు, టూవీలర్లు, ఆటోలు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణించాలి.
- ఆదివారం ఉదయం నుంచి అడవివరం, పాత గోశాల జంక్షన్ మధ్య ఎటువంటి వాహనాలను అనుమతించరు. ప్రత్యామ్నాయంగా వేపగుంట, పెందుర్తి, అక్కిరెడ్డిపాలెం, దువ్వపాలెం జంక్షన్ మీదుగా ప్రయాణించాలి.



సిబ్బందికి డ్యూటీలు వేస్తున్న ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి

- అడవివరం నుంచి గిరి ప్రదక్షిణ నిమిత్తం తొలి పావంచా వద్దకు వచ్చే భక్తులు వారి వాహనాలకు అడవివరం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్‌లో నిలపాలి. అక్కడి నుంచి కాలినడకన రావి చెట్టు జంక్షన్ నుంచి గాంధీనగర్, కోనేరు మీదుగా కలశం జంక్షన్‌కు చేరుకోవాలి.
- వేపగుంట, గోపాలపట్నం నుంచి వచ్చే భక్తులు పాత గోశాల వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశంలో వాహనాలు నిలపాలి. అక్కడి నుంచి కాలినడకన తొలి పావంచాకు చేరుకోవాలి.
- అనకాపల్లి నుంచి శ్రీకాకుళం, విజయనగరం వైపు వెళ్లే వాహనాలు విశాఖ నుంచి అనుమతించరు. ప్రత్యామ్నాయంగా అనకాపల్లి సబ్బవరం, పెందుర్తి, ఆనందపురం మీదుగా ప్రయాణించాలి.
- శ్రీకాకుళం, విజయనగరం వైపు నుంచి అనకాపల్లి వైపు వచ్చే వాహనదారులు విశాఖ నగరంలోకి రాకుండా ఆనందపురం, పెందుర్తి, సబ్బవరం మీదుగా అనకాపల్లి చేరుకోవాలి.
- ఆదివారం ఉదయం నుంచి పెదవాల్తేరు, కురుపాం జంక్షన్, అప్పుఘర్, విశాలక్షినగర్‌ల మధ్య బీచ్ రోడ్డులో వాహనాలు అనుమతించరు.
- జోడుగుళ్లపాలెం నుంచి హనుమంతవాక వైపు వాహనాల రాకపోకలను అనుమతించరు. ఆయా పరిసర ప్రాంతాల వారు విశాలాక్షినగర్ రోడ్డు నుంచి ప్రయాణించి ఎస్‌బీఐ జంక్షన్ వద్ద జాతీయ రహదారికి చేరుకోవాలి.
- ఆరిలోవ హెల్త్ సిటీకి వెళ్లాల్సిన ఎమర్జెన్సీ వాహనాలు ఆదర్శనగర్, ఓల్డ్ డైరీ ఫారం నుంచి ఆరిలోవ మీదుగా చేరుకోవాలి.
- అడవివరం జంక్షన్ నుంచి హనుమంతవాక జాతీయ రహదారికి వాహనాలను అనుమతించరు. వీరు స్కిల్ డెవలప్‌మెంట్ వద్ద నుంచి ఆరిలోవ వైపు ప్రయాణించి ఆదర్శనగర్ పాత డైరీ ఫారం వద్ద జాతీయ రహదారికి చేరుకోవాలి.
- వెంకోజీపాలెం నుంచి అప్పుఘర్ వైపు వాహనాలు అనుమతించరు.
- శ్రీకాకుళం, విజయనగరం వైపు నుంచి అనకాపల్లి, రాజమండ్రి, విజయవాడ, హైదరాబాద్ వెళ్లాల్సిన అన్ని ప్రైవేట్ వాహనాలు, ట్రావెల్ బస్సులు ఆనందపురం వద్ద మళ్లించనున్నారు.
- విశాఖ రైల్వే స్టేషన్, ఎయిర్‌పోర్ట్, ఆర్టీసీ కాంప్లెక్స్, గాజువాక వైపు వెళ్లే అన్ని వాహనాలు ఆనందపురం నుంచి పెందుర్తి, ఎన్ఏడీ మీదుగా చేరుకోవాలి.
- నగరం నుంచి శ్రీకాకుళం, విజయనగరం వైపు వెళ్లే భారీ వాహనాలు గాజువాక, కూర్మన్నపాలెం మీదుగా లంకెలపాలెం, అనకాపల్లి, సబ్బవరం, పెందుర్తి, ఆనందపురం మీదుగా ప్రయాణించాలి.
- ఎన్ఏడీ జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున గాజువాక నుంచి వచ్చే వాహనదారులు షీలానగర్, కోట నరవ, కొత్తపాలెం మీదుగా వచ్చి గోపాలపట్నం హై స్కూల్ జంక్షన్‌కు చేరుకోవాలి. గోపాలపట్నం వైపు వెళ్లాల్సిన వాహనదారులు విమాననగర్, ఎల్లపువానిపాలెం, ఆదర్శనగర్, చంద్రనగర్ మీదుగా గోపాలపట్నం హై స్కూల్ జంక్షన్‌కు చేరుకోవాలి.
- గాజువాక నుంచి వచ్చే వాహనదారులు బీహెచ్‌పీవీ జంక్షన్ వద్ద కుడి వైపు తిరిగి మింది గ్రామం నుంచి జింక్ గేట్ మీదుగా మల్కాపురం, కాన్వెంట్ జంక్షన్ల మీదుగా నగరంలోకి చేరుకోవాలి. అలాగే గాజువాక నుంచి వచ్చే వాహనదారులు కాకానినగర్ వద్ద కుడి వైపు తిరిగి సాకేతపురం, అశోకపార్క్, ఆశవానిపాలెం మీదుగా 104 జంక్షన్‌కు చేరుకొని అక్కడి నుంచి కంచరపాలెం మెట్టు మీదుగా నగరానికి రావాలి.
- గాజువాక నుంచి పెందుర్తి వైపు వెళ్లే వాహనదారులు ఆటోనగర్, తుంగ్లాం గేట్, వడ్లపూడి రైల్వే యార్డ్, దువ్వాడ రైల్వే స్టేషన్, సబ్బవరం మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.